క్లుప్తంగా

మాజీ వైస్‌చైర్మన్ శ్రీధర్‌కు సన్మానం

వనపర్తి టౌన్: మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ 30వ వార్డులో చేసిన అభివృద్ధికి విఘ్నేశ్వర కాలనీ వాసులు వాకిటి శ్రీధర్‌ను ఆదివారం శాలువా, బొకేతో స్థానిక కాలనీలో ఘనంగా సన్మానించారు. విఘ్నేశ్వర కాలనీకి రోడ్లను వేయించి, వీధిలైట్లు, భగీరథ కనెక్షన్స్ ఏర్పాటుతో కాలనీ రూపురేఖలను మార్చారని ఈ సందర్భంగా కాలనీవాసులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రమణ, కృష్ణయ్య, శివాజీ, కొండన్న, శంకర్, కిరణ్‌కుమార్, రాందాస్, తిరుమలేష్, మహేష్ పాల్గొన్నారు.

బోనాల పండుగను ఘనంగా నిర్వహించాలి

అమరచింత: ఈనెల 22న అమరచింతలో పోచమ్మతల్లి బోనాల పండుగను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని పోచమ్మ ఆలయంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహణపై కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రమేశ్, గోపాల్, మేస్త్రీ రాములు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

మదనాపురం: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు వార్డెన్ బెనర్జీ ఆదివారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వార్డెన్ మాట్లాడుతూ.. సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదుకోవాలని మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

మదనాపురం: మండలంలోని రామన్‌పాడ్ గ్రా మంలో 2002లో 10వ తరగతి విద్యార్థి మాస న్న చనిపోవడంతో ఆయన కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు రూ.35వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఆంజనేయులు, రాఘవేంద్ర, మహేష్, పహార్‌అలీ, సంజీవ, చిన్నరాములు పాల్గొన్నారు.

నాయినోనిపల్లి రహదారి బాగు చేయండి

గోపాల్‌పేట: అనంతపురం నుంచి తీగలపల్లి వెళ్లే దారిలో రోడ్డు అధ్వానంగా మారిందని వెంటనే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి బీటీరోడ్డు వేయాలని సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన అనంతపురం నుంచి తీగలపల్లి వరకు రోడ్డును పరిశీలించారు. ప్రతి ఆదివారం నాయినోనిపల్లికి వందలాది వాహనాల్లో వేలాదిమంది భక్తులు వస్తూ వెళుతూ ఉంటారని, దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి బీటీ రహదారిని వేయాలన్నారు.

కోటి లింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ స్టేజీ సమీపంలో కోటి లింగేశ్వర స్వామి ఆలయాన్ని గద్దర్ అవార్డు గ్రహీత మద్దాలి వెంకటేశ్వర్‌రావు ఆదివారం పంచలోహ శివలింగానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మద్దిగట్ల గ్రామంలో కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథక శిబిరంలో మూడోరోజు విద్యార్థులు వీధులను ఊ డ్చి శుభ్రం చేశారు. అనంతరం రాఘవేందర్ కిచెన్‌గార్డెన్ కూరగాయల విత్తనాల నాటి ప్రద ర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ విద్య, మాజీ ఎంపీటీసీ రామచంద్రయ్యగౌడ్, సత్యారెడ్డి, బుచ్చిలింగం,రమేష్, రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

చైతన్య యాత్రను జయప్రదం చేయాలి

వనపర్తి రూరల్: విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగే విశ్వబ్రాహ్మణ సాంస్కృతిక చైతన్యయాత్రను జయప్రదం చేయాలని పెబ్బేరు మండల స్వర్ణకార సంఘం అధ్యక్షుడు నాగ భూషణంచారి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 6న హైదరా బాద్ నుంచి ప్రారంభమైన యాత్ర ఆదివారం సాయంత్రం పెబ్బేరుకు వస్తున్న వారికి మండల స్వర్ణకార సంఘం స్వాగతం పలికారు. సోమవారం ఉదయం ఇక్కడి నుంచి యాత్ర మొదలవుతుందని ఆయన తెలిపారు.

రక్షణకంచె ఏర్పాటు చేయరూ..

వీపనగండ్ల: మండలకేంద్రం సమీపంలోని ఊరుచెరువు అలుగువద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణకంచెను ఏర్పాటు చెయ్యకపోవడంతో వాహనదారులు, చెరువులో నీరు తాగేందు కు వెళ్తున్న మూగజీవాలు షాక్‌కు గురయ్యే ప్రమాదంగా మారింది. ఊరచెరువు అలుగుకు అతి సమీపంలో ఉండి గుంతలు, మట్టి కుప్పలు ఉండడంతో ప్రమాదం పొంచి ఉందని విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే రక్షణ కంచెను ఏర్పాటు చెయ్యాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాలిథిన్ నిషేధం అమలేది..?

- హెచ్చరికలు పట్టించుకోని వ్యాపారులు
- అడ్డగోలుగా వినియోగం
- చోద్యం చూస్తున్న అధికారులు
- మున్సిపాలిటీల్లో అప్పుడప్పుడు దాడులు

ఆత్మకూర్: జిల్లాలో పాలిథిన్ కవర్ల నిషేధం కేవలం ప్రకటనలకే పరిమితమైంది. పాలిథిన్ వాడటం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని.. తీవ్ర అనర్థాలు చోటుచేసుకుటున్నాయని నివేదికలు హెచ్చరిస్తున్నా వ్యాపారస్తులు బేఖతార్ చేస్తున్నారు. పాలిథిన్ కవర్లను, ఇతర ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మార్పు లేనేలేదు.. ప్లాస్టిక్‌ను నియంత్రించాల్సిన అధికారులు సంబంధం లేకుండా వ్యవహారిస్తుండడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా పాలిథిన్‌ను వినియోగిస్తున్నారు.పాలిథిన్ కవర్ల స్థానంలో కాగితపు కవర్లు, జూట్ బ్యాగులు, బట్టసంచులు మాత్రమే వినియోగించాలని పలుమార్లు అధికారులు సూచించారు. చిన్నపాటి వర్షానికే డ్రైనేజీలు అన్ని నిండి పాలిథిన్ కవర్ల కారణంగా మురుగు ముందుకు పోవడంలేదు. ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని పాలిథిన్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

2022 నుంచి అమల్లోకి కఠిన చట్టం..

పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా 2022 జూలై ఒకటో తేదీ నుంచి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ ఎంఏయూడీ విభాగం నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తోంది.

జరిమానాలు ఇలా..

కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మున్సిపల్, ఆయాశాఖల అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం రూ.లక్ష వరకు జరిమానాలు విధిస్తారు. పట్టణాలు, మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, గ్రామీన ప్రాంతాల్లో నిషేధం పక్కాగా అమలు చేసేవిధంగా ఆదేశాలు వెలువడ్డాయి.



అమరచింతలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

మున్సిపాలిటీల్లో జరిమానాలు..

జిల్లాలో అప్పుడప్పుడు దాడులు నిర్వహించి రూ. 1000 చొప్పున జరిమానాలు విధిస్తున్నారు. గ్రామస్థాయిలో సైతం కొనసాగించాల్సిన అవసరం ఎంతైన ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జరిమానాలు ఇలా ఉన్నాయి..

జిల్లాలోని ఆత్మకూర్ పరిధిలో దాడుల్లో 20 మంది వ్యాపారులకు రూ.1000 నుంచి రూ.5వేల వరకు జరిమానాలు విధించారు.అలాగే అమరచింత మున్సిపాలిటీలో 50కేజీల ప్లాస్టిక్ స్వాధీనం చేసుకుని ఆరుగురికి జరిమానాలు విధించారు, పెబ్బేరులో 350 కేజీల ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం చేసుకుని 25 మంది వ్యాపారులకు ఫైన్ వేశారు, కొత్తకోటలో 70 కేజీలు స్వాధీనం చేసుకుని పలువురికి ఫైన్లు విధించారు, వనపర్తిలో 65 కేజీల ప్లాస్టిక్ స్వాధీనం చేసుకుని 26 మందికి జరిమానాలు విధించారు.



కొత్తకోటలో పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్న దృశ్యం



ఆత్మకూర్‌లో పట్టుబడిన నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు

కఠిన చర్యలు తీసుకోవాలి:

పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. వ్యాపారుస్తులకు మరోమారు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి.



-కలాంపాషా, రెడ్‌క్రాస్ జిల్లాఉపాధ్యక్షుడు, అమరచింత.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

అధికారుల నిర్లక్ష్యం, వ్యాపారుల అవగాహన రాహిత్యంతోనే ప్లాస్టిక్ వాడకం నిరంతరాయంగా కొనసాగుతుంది. ఇందుకు ప్లాస్టిక్‌ను అడ్డగోలుగా వాడుతున్న వారుకూడా బాధ్యులే. అధికారులు రోజు దాడులు నిర్వహించడం వల్ల వ్యాపారస్తులు పాలిథిన్ కవర్ల వాడకాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది.



– మోష, సీపీఐ నాయకుడు, ఆత్మకూర్

జరిమానాలు విధిస్తున్నాం

పాలిథిన్ కవర్ల వినియోగాన్ని నిషేధించినా దుకాణదారులు ఇష్టారాజ్యంగా వినియోగిస్తున్నారు. ఈ విషయమై పట్టణంలో దుకాణాల్లో తనిఖీలు చేపట్టి జరిమానాలు విధిస్తున్నాం.



-శిధర్, కమిషనర్, ఆత్మకూర్

ప్రజలు బాధ్యతగా తీసుకోవాలి

పాలిథిన్ కవర్లు వినియోగించడంవల్ల పర్యావరణం కాలుష్యం కావడంతోపాటు ప్రజలు తమబాధ్యతగా ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా పాలిథిన్ కవర్లను వాడడం మానుకోవాలి.



-చాంద్‌పాషా, తహసీల్దార్, ఆత్మకూర్

నేటి జిల్లా ధర్నాను జయప్రదం చేయాలి

పాన్‌గల్: పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు సక్రమంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని కోరుతూ ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ నాయకురాలు ఆది సంధ్యారాణి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనిప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ దగ్గర విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులకు పాఠశాల సమయానికి బస్సుసౌకర్యం కల్పించాలని పార్టీ ఆధ్వర్యంలో గతంలో జిల్లా కలెక్టర్‌కు, ప్రతి మండల తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేసిన స్పందన లేదన్నారు. దీంతో జిల్లాకేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ధర్నా కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రాములు, శివరాజ్, లక్ష్మణ్, రామకృష్ణ, శివ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

తండాలో సమస్యలు పరిష్కరించండి



ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న తండావాసులు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్ళపల్లితండాలో నెలకొన్న స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గిరిజనులతో కలిసి ఆయన తండాలో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. తండాలోని రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించిన స్పందన లేదని, తండాలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, మంచినీటి సమస్యలతో తండా వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే తండా వాసులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాబు, రవినాయక్, బాలునాయక్, తులసీరావు, అనిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డు.. రాకపోకలకు పాట్లు

పాన్‌గల్: మండలంలోని వెంగాళాయిపల్లి సమీపంలో అసంపూర్తి రోడ్డుతో ప్రతీనిత్యం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వనపర్తి–కొల్లాపూర్ ప్రధాన రోడ్డు గ్రామంలో సీసీ రోడ్డు ఒక పక్క వేసి మరో పక్క వేయడంలో నెలల తరబడి జాప్యం చేస్తుండటంతో ఈ రోడ్డు ద్వారా వెళ్లే వాహనదారులు ప్రతీనిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తి రోడ్డుతో ఎదురుగా ఒక వాహనం వస్తే మరో వాహనం వెళ్లడం ఇబ్బందిగా మారింది. ఏదో ఒక వాహనం వెనకకు వెళితే మరో వాహనం వెళ్లడానికి వీలు కలుగుతుంది. ఒకే పక్క రోడ్డు వేసి మరో పక్క వేయకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇటీవల ఈ రోడ్డుపై ఒక వైపు నుంచి లారీ, మరో వైపు నుంచి ఆర్టీసీ బస్సు రావడంతో చాలా సేపు వాహనాలు రోడ్డుపైనే నిలిచి ఇబ్బందులు పడ్డారు. ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తి సీసీ రోడ్డును పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలని వాహనదారులకు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ రాకేష్‌ను వివరణ కోసం ప్రయతించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



ఇబ్బంది ఎదుర్కొంటున్న వాహనాలు (ఫైల్)

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- మాముళ్లతో అధికారులు గప్‌చుప్

వీపనగండ్ల: అటవీ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలో అక్రమ కలప రవాణా యథేచ్ఛగా కొనసాగుతుంది. మండలంలోని రంగవరం గ్రామంలో దాదాపు పది కుటుంబాలు అక్రమ కలపను ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా సరఫరా చేస్తున్న సంబంధిత అధికారులు అమ్యామ్యాలకు ఆశపడి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో తూముకుంట, సంగినేనిపల్లి, వీపనగండ్ల, బొల్లారం, కల్వరాల్ల, గోపల్‌దిన్నె గ్రామాల నుంచి చీకటి పడగానే పదుల సంఖ్యలో ట్రాక్టర్‌లు పెబ్బేరులోని కొత మిషన్‌లకు కలపను చేరవేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గట్టి నిఘాను ఏర్పాటు చేసి అక్రమ కలప రవాణాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

'తీన్మార్' మల్లన్న ఆఫీసుపై దాడి తగదు

గోపాల్‌పేట: తీన్మార్‌మల్లన్న ఆఫీసుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా యువజన కాంగ్రెస్ ఆర్టీఐ చైర్మన్ కొంకిరమేశ్ అన్నారు. ఆదివారం వారు బీఆర్‌ఎస్ జనజాగృతికి చెందిన నాయకులు మల్లన్న ఆఫీసుపై దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. ఏదైనా తప్పుగా మాట్లాడి ఉంటే చట్టపరంగా ముందుకెళ్లాలన్నారు. తక్షణమే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

16న రాయల చంద్రశేఖర్ వర్ధంతి నిర్వహించాలి

అమరచింత: ఇల్లందులో ఈనెల 16న జరిగే రాయ ల చంద్రశేఖర్ ప్రథమ వర్ధంతిని నిర్వహించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కోశాధికారి రాజు కోరారు. మండలకేంద్రంలోని మార్క్‌భవనంలో ఆదివారం చంద్రశేఖర్ వర్ధంతి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నమ్మిన విప్లవ సిద్ధాంతాల కోసం శ్రమిస్తూ నిరంతరం పేదప్రజల సమస్యల పరిష్కా రానికి రాజీలేని పోరాటాలు చేస్తూ గతేడాది చంద్రశేఖర్ అకాల మృతి చెందాడన్నారు. సభకు ముఖ్య అతిథిగా ఆలిండియా కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూ ర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య హాజరవుతారని వెల్లడించారు. రాజన్న, సామెలు, మాస్లామని, కురుమన్న,ప్రేమరత్నం పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

గోపాల్‌పేట: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరమైన తప్పవని రేవల్లి ఎస్సై రజిత హెచ్చరించారు. ఆదివారం రేవల్లి మండలంలోని తల్పు నూరు గ్రామానికి సమీపంలో బీటీ రోడ్డు పక్కన ఓ వ్యక్తి ట్రాక్టర్‌లో మట్టిని పోసి చెరువు నీటితో ఫిల్టర్ ఇసుక తయారు చేస్తుండగా 'సాక్షి' వారిని పలకరించింది. అనుమతులు తీసుకున్నానని తన ఇంటికోసం తాను తయారు చేసుకుంటున్నానని సమాధానమిచ్చాడు. ఇదే విషయంపై ఎస్సై రజితను వివరణ కోరగా తల్పునూరు గ్రామంలో ఓ వ్యక్తి అయితే అనుమతులు తీసుకున్నాడని చెప్పారు.

జీవో 98, 45 ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలి

వనపర్తి రూరల్: అర్హులైన ప్రతిఒక్కరికి జీవో 98, 45 ప్రకారం ఉద్యోగాలు కల్పించాలని నిర్వాసితులు కొల్లాపూర్ బీజేపీ నాయకుడు ధారాసింగ్ డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఆయన బీజేపీ నాయకులు ఆదివారం రాఘవేందర్‌గౌడ్ భార్యను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన రాఘవేందర్‌గౌడ్ ఇటీవలి కాలంలో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీశైలం ప్రాజెక్టు నిరుద్యోగ నిర్వాసితుల కోసం న్యాయపోరాటం చేస్తున్నామని కేసు హైకోర్టులో తుదిదశకు చేరుకుందని వారికి ఉద్యోగాలు వచ్చేవరకు అండగా ఉంటామన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత విద్య

ఆత్మకూర్: గ్రామీణ ప్రాంతాల్లో సైతం సీబీఎస్‌ఈ విద్యను అందిస్తుండడం అభినందనీయమని విద్యార్థులు దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదగాలని రాష్ట్ర పశువర్ధక, క్రీడలు, యువజన, మత్స్యశాఖల మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం ఆత్మకూర్‌లోని ఎంవీ రామన్ హైస్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ ప్రియవర్ష సైన్స్ ల్యాబ్‌ను మంత్రి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. రూ.10కోట్ల వ్యయంతో అత్యాధునికంగా సైన్స్‌ల్యాబ్‌ను ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పోటీ ప్రపంచానికి తగినట్లుగా విద్యార్థులకు కావల్సిన సౌకర్యాలను ఒకేచోట సమకూర్చడం అభినందనీయమన్నారు. అలాగే రాష్ట్ర ఐజీ మస్తిపూర్ రమేశ్‌రెడ్డి, మాజీ జెడ్పీచైర్మన్ స్వర్ణమ్మ, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర గీతపారిశ్రామిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేషం నాగరాజుగౌడ్, బీజేపీ రాష్ట్రనాయకుడు కొండయ్య, బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి ప్రసంగించి డైరక్టర్ శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఆన్సీశ్రీధర్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు, అఖిలపక్షం పార్టీల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో నూతన సైన్స్‌ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

ఎల్‌ఓసీ అందజేత..

ఆత్మకూర్ మండలంలోని గుంటిపల్లి గ్రామానికి చెందిన రాములుకి వైద్యఖర్చుల నిమిత్తం రూ.5లక్షల ఎల్‌ఓసీని మంత్రి శ్రీహరి అందజేసారు. అలాగే పిరమిడ్ ధ్యానకేంద్రంలో ధ్యానులతో సమావేశమై స్థల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, అయ్యూబ్‌ఖాన్, రహ్మతుల్లా పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి

మధనాపురం: మండలంలోని గోపన్‌పేట గ్రామంలో మంత్రి వాకిటి శ్రీహరి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంబేడ్కర్ సంఘం గ్రామస్తుల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొని మాట్లాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులకు సన్మానం

వనపర్తి టౌన్: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన ఎడవల్లి వీరప్ప, విశ్వంబాబు, రామచంద్రయ్య, వెంకటేశ్‌లను మాదిగ ఉద్యోగుల సమైక్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాదిగ ఉద్యోగుల సమైక్య జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 85 శాతం ఉన్నప్పటికీ రాజ్యాధికారం దక్కట్లేదు, రాజకీయంగా ఎదగలేకపోతున్నామని, ఓటు చైతన్యంతోనే రాజ్యాధికారం దక్కుతుందన్నారు. అదేవిధంగా కమిటీ సభ్యుడిగా ఎన్నికైన భోజరాజును జాతీయ మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కరణం కిషన్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రాష్ట్ర ఉపాధ్యక్షుడు భగవంత్‌గౌడ్, మాదిగ ఉద్యోగుల సమైక్య సంఘం ప్రతినిధులు భగవంత్‌గౌడ్, బోరెల్లి వెంకటయ్య, ద్యారపోగు ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు కేశపాగ కేశవులు, జొల్లు నారాయణ, మాలల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శ్రీరంగ, ఉపాధ్యక్షుడు ఆవుల సుధీర్, నాయకులు హనుమంత్, కరుణాకర్, వెంకటేశ్, మాదారి సూర్యబాబు, శ్రీనివాసులు, బాలస్వామి, కురుమూర్తి, నరేష్, కొమిరే నగేష్, చందాపూర్ బాలస్వామి, రిటైర్డ్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఆవుల కురుమూర్తి, బత్తుల శ్రీనివాస్, చక్రి, తదితరులు పాల్గొన్నారు



సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

కాంగ్రెస్ మోసపు హామీలు నమ్మొద్దు

వనపర్తి రూరల్: మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌రెడ్డి, పలువురు నాయకులతో కలిసి పెబ్బేరు పట్టణంలోని 9, 10 వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ చెబుతున్న మోసాలను ప్రజలకు వివరించారు. ఆరు గ్యారెంటీల పథకాలతో ప్రజలకు ఆశలు చూపించి ఓట్లు వేయించుకొని, ఇప్పుడు పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. పట్టణంలో ప్రతివార్డులో ఏ ఒక్క అభివృద్ధి జరగలేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన నిధులతో వార్డుల్లో సీసీ రోడ్లు వేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కర్రెస్వామి, సాయినాథ్, స్వామి, చిన్నాఎల్లారెడ్డి, వేణు, విశ్వరూపం, వడ్డె ఈశ్వర్, బీసుపల్లి శేఖర్‌గౌడ్, బసవరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పెబ్బేరులో ఇంటింటి ప్రచారం పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

మున్సిపల్ అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటు

వనపర్తి రూరల్: పెబ్బేరు మున్సిపాలిటీ కేంద్రం దగ్గర ఆదివారం వర్కర్ల సమావేశం నిర్వహించి మణికంట మున్సిపల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ అయూబ్, గౌరవ అధ్యక్షుడు జీవి భగవంతు, ఉపాధ్యక్షులు జి బక్కన్న ,జి బాలయ్య, ప్రధాన కార్యదర్శులు ఎం గంగన్న, కోశాధికారి రాజు, మీడియా కన్వీనర్ దిలీప్, ప్రచార కార్యదర్శులు డి కృష్ణ, శేఖర్, జయశ్రీ, సహాయ కార్యదర్శులు రంజిత్‌కుమార్, భాస్కర్, ఈశ్వర్, ఈశ్వరమ్మ,తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. అధ్యక్షుడిగా ఎన్నుకున్నందు మున్సిపల్ వర్కర్లకు, కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.



మున్సిపల్ అసోసియేషన్ కార్యవర్గం

నారుమడులను సిద్ధం చేస్తున్న రైతులు

వీపనగండ్ల: మండలంలోని జూరాల కాల్వకు వారం రోజుల క్రితమే నీరు వదలడంతో రైతులు నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు. గోపల్‌దిన్నె, రంగవరం, గోవర్ధనగిరి, వీపనగండ్ల, తూముకుంట తదితర గ్రామాలలోని రైతులు నారుమడులను సిద్ధం చేస్తూ నాణ్యమైన విత్తనాల కోసం ప్రైవేటు ఏజెన్సీలను ఆశ్రయిస్తున్నారు. సకాలంలో రైతులకు అవసరమైన వరి విత్తనాలను అందించి కల్తీ జరుగకుండా మండల వ్యవసాయ అధికారులు నిఘా వేసి ఉంచాలని మండలంలోని బొల్లారం, తూముకుంట, సంగినేనిపల్లి, గోవర్ధనగిరి, పుల్గర్‌చర్ల, కల్వరాల్ల గ్రామాలలో పలువురు ప్రైవేటు వ్యాపారస్తులు ఎలాంటి లైసెంచ్‌లు తీసుకోకుండా రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యం చేస్తే వందలాది మంది రైతులు నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి పూర్తి స్థాయిలో నష్టపోతారని జిల్లా స్థాయి వ్యవసాయ అధికారులు మండల స్థాయి అధికారులతో సమన్వయం ఏర్పాటు చేసుకొని నకిలి విత్తనాల అమ్మకాలను నిరోదించాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.



వీపనగండ్లలో నారుమడులను సిద్ధం చేసుకున్న రైతులు

రహదారులు గుంతలమయం



మస్తీపురం గ్రామంలో రహదారి దుస్థితి



రైతువేదిక సమీపంలో భారీ గుంత

- వాహనదారులు అవస్థలు

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రదాన రహదారి విస్తరణ పనులు అసంపూర్తిగా సాగుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మస్తీపురం ఎక్స్‌రోడ్ నుంచి కిష్టంపల్లి వరకు బీటీ రోడ్డు వేసిన సదరు కాంట్రాక్టర్ మస్తీపురం గ్రామం మీదుగా వెళ్తున్న రహదారిని వదిలేశాడు. సుమారు 600 వందల మీటర్ల మేరకు సీసీ రోడ్డు వేయాల్సి ఉండగా వీటిని పూర్తిస్థాయిలో విస్మరించారు. జూరాల ప్రాజెక్టుపై వెళ్తున్న రహదారి గుంతలమయం అయిన సంబంధిత అధికారులు పట్టించుకోలేక పోతున్నారు. ఉమ్మడి జిల్లాకే వరప్రదాయనిగా ఉన్న జూరాల ప్రాజెక్టు రహదారి అస్తవ్యస్తంగా ఉండటం ఏమిటని పర్యాటకులు విస్తుపోతున్నారు. సీసీ రహదారి పనులకు మంత్రి వాకిటి శ్రీహరి భూమిపూజ చేసి నేటికీ మూడు నెలల కాలం దాటుతున్న పనులు మాత్రం ముందుకు సాగలేక పోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులను బాగుచెయ్యాలని కోరుతున్నారు.